# రెండుచోట్లా ఒకే గాలి

శ్రీ వి. రాజారామమోహనరావు

ఆ పందిట్లో హడావిడి గాలిని కదలనివ్వటం లేదు. బాగా ఉక్కగా ఉంది. అయినా అక్కడున్న అందరూ సంతోషంగా ఉన్నట్టే కనిపిస్తున్నారు. గట్టిగా మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ అటూ యిటూ తిరుగుతున్న వాళ్ల చూపులు పందిరి మధ్యగా తయారవుతున్న పెళ్లి మండపం మీద పడుతున్నాయి.

అక్కడ.... మండపం దగ్గర జిడ్డుముఖంతో, జారిపోతున్న పంచతో నిలబడి అజమాయిషి చేస్తున్నాడు వెంకట్రావు. అతనికి సంతోషంగా లేదు. చాలా విసుగ్గా ఉంది. చుట్టూ గోల... పనుల్తోటి హడావిడి తోటి కమ్ముకున్న అలసట.... అతన్ని నిలబడ నివ్వటం లేదు.

లేని ఓపిక కూడదీసుకుని అలా అజమాయిషి చెయ్యటం చిరాగ్గా ఉంది. దానికన్నా జారిపోతున్న పంచ ఇబ్బందిగా ఉంది. అలవాటు లేదన్నా వినకుండా ... 'ముఖ్యమైన పెళ్లిపెద్దవి, జులాయిగా పేంటు వేసుకోవటం బాగుండదని' కట్టపెట్టారు పంచ. దానికన్నా పనిలేకుండా అస్తమానం తనవేపు చూసే బంధువుల కోసం పలకరింపుగా రాని నవ్వు తెచ్చుకోవటం మరీ యిబ్బందిగా ఉంది.

చాలా రోజుల తరువాత కనిపించిన బంధువులు, స్నేహితులు ఎదురుగా తిరుగుతున్నారు. వాళ్లతో మాట్లాడాలని ఉన్నా మాట్లాడలేక పోతున్నానన్న విషయం వెంకట్రావుకి తెలుస్తూనే ఉంది. నిన్నటి నుంచీ తనచుట్టూ కమ్ముకున్న నిశ్శబ్దం రెండు మూడు సార్లు ఆలోచనని అటు తీసుకు పోయింది.

రెండేళ్ల క్రితం..... ఆ రోజు తను, ఇంలా చాలా మంది యిలాగే నిశ్శబ్దంగా కూచున్నారు. అప్పటి వరకు తమలో ఒకడిగా కలిసి మెలిసి తిరిగిన స్నేహితుడి శవం ఎదురుగా ఉంది. ఏం చెయ్యాలో ఎవరికీ తోచలేదు. పోయిన స్నేహితుడి బంధువుల రాకకోసం ఎదురు చూసిన ఆ గంటా, ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోలేని ఆ నిశ్శబ్దం.... స్నేహితుడు పోయాడన్న బాధ....

నిన్నటినుంచీ ఈ నిశ్శబ్దం ఆ సంఘటనని గుర్తు తెచ్చి బాధిస్తోంది. దాన్నించి తప్పించుకోటానికేనా ఏదో ఒకటి కల్పించుకుని మాట్లాడాలని ప్రయత్నించాడు ఒకటి రెండు సార్లు. ప్రయత్నించిన మాటల్ని పైకిరానీకుండా సాగుతున్న ఆలోచన తినేసింది. 'అది తప్పు.... యింకో దారిలేదా' అన్న ఆలోచన సాగుతూనే ఉంది వెంకట్రావులో.......

మండపం కడుతున్న వాళ్లు గట్టిగా మాట్లాడుకుంటూ పని చేస్తున్నారు. అక్కడో మనిషి లేకపోతే వాళ్లు మాటల్లోపడి పని తొందరగా చెయ్యరని అనుమానం. వాళ్ల మాటలు పెద్ద గోలలా ఉన్నాయి వెంకట్రావుకి. ఇంతలో ఎవరో వెనకనుంచి పిలిచారు, 'మిమ్మల్ని ఓసారి రమ్మంటున్నారండి' అని. అక్కడ నుంచి, ఆ గోల నుంచి కాస్సేపైనా దూరంగా వెళ్లిపోవటానికి ఆ పిలుపు మంచి ఆసరా అయింది.

వంటలు జరుగుతున్నవేపు కదులుతూ వెంకట్రావు కాళ్లు చెప్పాయి, అక్కడేదో అవసరం ఎదురు చూస్తుంటుందని. నిన్నటి నుంచీ అవసరాలు పెరుగుతూనే ఉన్నాయి. పెరిగే ఈ అవసరాలకి కారణంగా కనిపించేది చెల్లెలి పెళ్లొక్కటే. నిజానికి ఆ ఒక్కటే కారణం కాదు... దాని వెనుక పేరుకు

పోయిన ఆచారాలు, ఆడంబరాలు.... పెట్టుబళ్లు చాలా ఉన్నాయి.

ఎదిగిన చెల్లెలి బరువు అప్పులో మునిగి పోకుండా దించుకోవాలనుకున్నాడు వెంకట్రావు ముందు. నిండుగా జీవితంలో కలిసి బతకాలనుకునే యిద్దర్ని చేరువ చేసే పెళ్లయితే అల్లా చేయవచ్చు కాని, ముద్దులు మురిపాలే ఎక్కువ ప్రాముఖ్యం వహించే పెళ్లికి అప్పు చెయ్యక తప్పదని తరువాత గ్రహించాడు. అది తెలిసింతర్వాత తనకొచ్చే జీతం మీద తీర్చ గలిగినంత అప్పే చెయ్యాలనుకున్నాడు. నిన్నటివరకూ అంతే చేశాడు. కాని నిన్నటి నుంచీ అనుక్షణం అతన్ని మింగటానికి చూస్తున్నాయి అప్పులు.

ఖర్చుతో కూడిన ప్రతి పనికీ ఆచారమనో, మర్యాదనో పేరు పెట్టి దేన్నీ కాదనకూడ దంటున్నారు చుట్టూ చేరిన పెద్దలు. డబ్బుతో ముడిపడిపోయిన ఈ పెళ్లి తతంగంలో చేస్తున్న ప్రతి పనీ అయిష్టంగానే ఉంది. ఖర్చనే కాదు. ఆ ఖర్చుకి తను తట్టుకోలేననే కాదు.... చేస్తున్న వాటిలో చాలా వాటిలో అచారమన్న పేరు తప్ప వేరే ఏం అర్థం కనిపించటం లేదు. ఏవేవో అర్థాలు చుట్టూఉన్న వాళ్లు చెపుతున్నా, ఈ కాలానికి, నేటి బతుకులకి అవి సరైనవి కావని మనసు చెపుతోంది. అవి యధావిధిగా జరగనంత మాత్రంలో ఏర్పడే లోటేమిటో కనిపించటం లేదు.

వంటలు దగ్గరికి చేరేటప్పటికి...''బియ్యం చాలవు, రాత్రికే ఇంకో బస్తా కావాల''న్నారు.

గాడిపొయ్యి దగ్గర వేడికి, లోపల జరుగుతున్న సంఘర్షణకి... విన్న ఆ మాటకి... తనేదో వూపిరాడని పెద్ద గోతిలో కూరుకు పోతున్నట్టనిపించింది వెంకట్రావుకి.

'సరే' అన్నట్టు తలూపి వెనక్కి తిరిగి మళ్లీ పందిట్లో కొచ్చాడు.

పందిట్లో వాసాల్ని, పైన తాటాకుల్ని, ఆడుకునే పిల్లల్ని, మాట్లాడుకునే బంధువుల్ని అందర్నీ చూస్తూ కదిలాయి వెంకట్రావు చూపులు. అన్నీ ఒకేలా కనిపించాయి.... అరుగు దగ్గర కూచుని స్నేహితురాళ్లతో మాట్లాడుతున్న చెల్లెలు తప్ప... తెల్లటి చీరలో.... గాలికి వూగుతున్న పువ్వులా అటూ యిటూ కదుల్తూ మాట్లాడుతోంది.....

ఎన్నో ఏళ్లుగా అదో కల వెంకట్రావుకి. తండ్రిపోయిన దగ్గర నుంచి తనకున్న ముఖ్యమైన బాధ్యత అదే అనుకున్నాడు. ఏ పెళ్లికి వెళ్లినా కొన్నాళ్లు చెల్లెలి పెళ్లే కళ్లముందు నిలిచేది. చెల్లెల్ని ఎప్పుడు పెళ్లికూతురిగా చూస్తానా అనుకునేవాడు. ఈనాడు కళ్లముందు చెల్లెలు పెళ్లికూతురై ఉన్నా.....

చెల్లెలు కూచునున్న అరుగుమీంచి కావాలనే చూపు మరల్చుకున్నాడు. ఇంక అక్కడ నిలబడాలనిపించలేదు. అక్కడే కాదు. ఆ ఇంట్లో ఎక్కడా ఉండాలనిపించలేదు. ఇల్లు యిదివరకులా కనిపించటం లేదు. నిన్నటినుంచీ..... ఇంట్లో ప్రతి గది, అరుగు... కిటికీ..... ఓ గుర్తుగా, చిన్నతనం నుంచీ ఆ యింట్లో గడిచిన జీవితంలో ఎప్పటిదో ఓ జ్ఞాపకంగా కనిపిస్తోంది. ఇప్పుడు వాటి నన్నిటినీ వదులుకోవాలా.... అన్న బాధ.....

డబ్బు మరీ అవసరం అయితే ఏం చెయ్యాలో చూచాయగా ఓ ఉద్దేశం ఉంది వెంకట్రావులో... ఉన్న యింటిని తాకట్టు పెట్టటానికి ఎవరి దగ్గరకు వెళ్లాలో ముందుగానే తేల్చుకున్నాడు. ఇల్లు తాకట్టు పెట్టడమంటూ జరిగితే యింటి మీద ఆశ వదులుకోవటమే అన్న విషయం బాగా తెలుసు.

ఈ పెళ్లికిగాను తీసుకున్న లోను పోను వచ్చే జీతంతో యిల్లుగడవటమే కష్టం మరో నాలుగేళ్లవరకూ. ఇంకా అప్పుచేస్తే ఎంత జాగ్రత్తపడి కూడపెట్టినా తీర్చగలిగేది వడ్డీ తప్ప అసలు కాదనేది తెలుసు.

నిన్నటినుంచీ అదే ఆలోచన. అంతవరక గట్టునే ఉన్నాడు. తను మళ్లీ మామూలుగా నిలదొక్కుకుని, తన మీద ఆధారపడ్డ వాళ్లని నిలబెట్ట గలనన్న ఆశఉంది. కాని యిప్పుడు యింకా డబ్బు కావాలి అన్న ఆలోచనొచ్చినప్పుడల్లా చిరాకు

కదులుతోంది. వచ్చిన బంధువులమీద, జరుగుతున్న ఏర్పాట్లమీద.... పెళ్లి తతంగం మీద విసుగొచ్చి చివరికి తనమీద తనకే అసహ్యం పుడుతోంది.

ఇంక అక్కడ నిలబడలేక అనుకోకుండానే పెరటి వేపు వెళ్లాడు. నీళ్లతో ముఖం కడుక్కుని కూచుంటే ప్రాణం కాస్త కుదుటపడి నట్టని పించింది.

ఆలోచన సాగుతూనే ఉంది ఏం చెయ్యాలా అని... ఆఫీసు లోను కాక చనువున్న స్నేహితులదగ్గర ఇప్పటికే వెయ్యిదాకా అప్పు చేశాడు. ఇంకా అయిదారు వందలు కావాలి. బంధువుల దగ్గర తీసుకో వచ్చు కాని ఎప్పుడు తిరిగి యివ్వగలిదేది?

'చేతిలో ఖర్చుకి తగినంత డబ్బులేక పోవట మేనా ఈ బాధ కంతా కారణం.... సరైన ఖర్చు, అవసరమైందే అనిపిస్తే అప్పు చెయ్యటానికి ఇంతగా తటపటాయింపు ఉండేది కాదు తనలో. పెట్టుబడులని, అనాదిగా వస్తున్న సంప్రదాయాలని ఎన్నో అనవసరపు పనులు చెయ్యాల్సి వస్తోంది. తనలాంటి నగటు జీవితాలకి ఈ పద్ధతులు సరైనవి కావని తెలియటం వల్ల ఏర్పడుతున్న తపన ఇది....' ఆలోచన తెగక చాలాసేపు అలాగే కూచున్నాడు వెంకట్రావు.

ఆ రొంపిలోంచి, కల్మషంలోంచి బయట పడాలని వెంకట్రావు మనసు గింజుకుంటోంది. ఆడపిల్ల వాళ్ళ అణుకువగా ఉండాలన్న ఆచారం అతని లోని యవ్వనాన్ని చంపి ముసలాణ్ణి చేస్తోంది. వీటన్నిటికన్నా, ఉన్న ఒక్క చెల్లెలి పెళ్లిలోనూ సంతోషంగా ఉండలేక పోతున్నానే అన్న బాధ వెంకట్రావుని మరీ కుంగదీస్తోంది.

"ఒరేయ్ ఇక్కడున్నావా... నీ గురించి ఇల్లంతా వెతుకుతుంటేనూ..... సరేలే.... లే.... నడు."

బాబయ్య గొంతులో ఆ ధ్వని గ్రహించాడు వెంకట్రావు. ఆలోచన ఒక్కసారిగా తెగిపోయింది. నాలుగడుగులువేసే లోపలే తెలిసింది పెళ్లికొడుకు ఎందుకో కబురు పెట్టాడని.

వెంకట్రావు వెళ్లిం తర్వాత పెళ్లికొడుకు పావుగంటసేపు నవ్వుతూ నట్టుతూ చెప్పాడు. "చూడండి బావగారు... ఏం లేదు. మా చెల్లాయి రేణూలేదు, అది చిన్నప్పట్నించి కొంచం పెంకిది. అందులో ఒక్కత్తే ఆడపిల్లమూలాన్ని మరీ గారంగా పెరిగింది. మీరు లాంఛనాలకోసం తీసుకున్న చీర మరీ నాసిగా ఉందంటోంది. ఏదేనా పట్టుచీర తెప్పించండి. ఇంకో ఏవేవో అంది చిన్న చిన్నవి. మీ బాబయ్యగారితో చెప్పానులెండి. మీరు కొంచం దాని మనసు చిన్నబోకుండా చూడాలి మరి."

చెప్పిందంతా విని..."దాని దేముందండి అలాగే చేద్దాం" అంటం తప్ప ఇంకేం మాట్లాడలేకపోయాడు వెంకట్రావు. మాట్లాడాలని లేకకాదు. 'నాకూఉన్నది ఒక్క చెల్లెలే. దాని పెళ్లి నేను నవ్వుతూ సంతోషంగా చేసే అవకాశాన్నివ్వండి. ఈ లాంఛనాల పేరు మీద ప్రాణాల్తో నన్ను చంపి.. ముందున్న నా బతుకులోని ఉత్సాహాన్నంతా ఖూనీ చెయ్యకండి' అని చెప్పాలను కున్నాడు కాని ఆచారం అడ్డొచ్చింది. తలవంచుకుని వెనక్కి వచ్చేశాడు.

గది చేరగానే భుజంమీద కండువా తీసి ఉండలా మూలకి విసిరేశాడు. కాస్సేపు గదంతా కలయ తిరిగాడు. స్థిమితం చిక్కలేదు.

ఓ గంటకి పెట్లోంచి దస్తావేజులు తీసుకుని బయటికి నడిచేవరకూ అతని మనసు, వయసు, ముదిరిపోయిన చాదస్తాలతో దెబ్బలాడుతూనే ఉంది.

* * *

రాత్రి లైట్ల వెలుగులో జారిపోతున్న పంచెతో..... గుచ్చుకుంటున్న కండువాతో చచ్చిపోయిన మనసుతో నిలబడి చెల్లెలి పెళ్లి చూస్తున్న వెంకట్రావు కళ్లలోకి నీళ్లు పొంగుకొచ్చాయి-

అక్కడే..... పిరిగ్గా వెలిగే లైట్లచుట్టూ, సన్నాయి చుట్టూ తిరుగుతూ ఆ పెళ్లి చూసినగాలికి మనసు కలుక్కుమంది. 'డబ్బులేక యిబ్బంది పడ్డాడు పాపం' అనుకుంది వెంకట్రావుని చూసి...అనుకుని అక్కడుండలేక పందిరి మీదకి నెమ్మదిగా పాకి పూరు చివరికొచ్చి రైలెక్కింది గాలి....

* * *

ఆ పట్టణంలో రైలుదిగిన గాలి రికామీగా బైలుదేరి అక్కడికి చేరింది.

అక్కడ ... ఆడంబరం అటూ యిటూ తిరుగుతోంది. హుందా తీరుబడిగా కూచుని ముచ్చట్లాడుతోంది. బట్టల్తోపాటు ఉత్సాహాన్ని తొడుక్కొచ్చిన చాలామంది గుంపులు గుంపులుగా మాట్లాడుకుంటున్నారు.

నాయుడుగారు విశాలంగా ఉన్న షామియానా కింద కలయ తిరిగారు...పలకరించడం అవసరం అనుకున్నవాళ్లని పలకరిస్తూ; పలకరింపుగా నవ్వటం చాలనుకున్న వాళ్లని చూసి నవ్వుతూ.

పెళ్లికి రావాల్సిన వాళ్లు చాలామంది వచ్చారు. స్నేహితులు పెద్ద పెద్ద ఉద్యోగస్తులు; బంధువులు... తోటి పెద్ద చెయ్యి వ్యాపారస్థులు.....

కాని నాయుడుగారికి తృప్తిగా లేదు. ఓచోట నిలబడాలని లేదు. చేస్తున్న సంబంధంమీద ఆయనకంత మక్కువలేదు. కుర్రాడు బుద్ధిమంతుడే. తెలివైనవాడే. కాని అంతస్థు, హోదా తగిందికాదని, నలుగురూ చిన్నతనంగా చూస్తారని ఆయన బాధ.

అలా తిరుగుతుంటేనే ఎవరో అడిగారు ఆయన్ని.... "మీ పెద్దమ్మాయి రాలేదాండీ..." అని. ఏదో సమాధానం చెప్పి మరో మూలకి నడిచారు. కాని మనసులో ఓ మూల కలుక్కు మంటోంది. అది పెద్దమ్మాయి పెళ్లికి యింతవరకూ రానందుకు కాదు. ఇంకాసేపట్లో పెద్దమ్మాయి వాళ్లు ఎలాగా వస్తారని తెలుసు ఆయనికి.

రెండో కూతురి పెళ్లి తతంగం మొదలుపెట్టిన దగ్గర నుంచి, పెద్దమ్మాయి అనగానే కళ్లముందు నలభైవేలు కదులుతున్నాయి ఆయనకి. నలభైవేలతో సలక్షణంగా ఏ గొడవలూ లేకుండా తన అంతస్థుకు మించిన వాళ్లతో ఆయన చేసిన ఆ సంబంధం గుర్తొస్తోంది. అది గుర్తొచ్చినప్పుడల్లా చేస్తున్న ఈ సంబంధంమీద చిన్న చూపుగానే ఉంది. ఏమైనాసరే ఈ పెళ్లి ఖర్చు నలభైవేలు దాటకూడదని నిశ్చయించుకున్నారు. దాటితే అది తన అప్రయోజకత్వమే అనిపించింది ఆయనకి.

అందుకని ఈ పెళ్లిలో అవుతున్న ప్రతి చిన్న ఖర్చు నలభైవేలకి దగ్గరగా తీసుకెడుతున్నట్టే ఉంది. డబ్బున్నా, అవసరమైనా ఖర్చుపెట్టలేడాయన యిప్పుడు....

గంటక్రితమే కాబోయే అల్లుడు కనిపించి ముద్దుగా పలకరించాడు నాయుడుగార్ని. మళ్లీ మరోసారి గట్టిగా చెప్పాడు... మర్నాటి రిసెప్షన్‌లో తను చెప్పిన ఎంటర్‌టైన్‌మెంటు ప్రోగ్రాం ఎరేంజి చెయ్యటం మరిచిపోవద్దని.

ప్రోగ్రాంకి అయిదువేలకన్నా ఎక్కువకాదు. కాని నాయుడుగారికి యిష్టం లేదు. పెద్ద పిల్ల పెళ్లిలో యింత పెద్ద ప్రోగ్రాం పెట్టలేదు.

అరగంట గడిచేలోపల అయిదారు వార్తలందాయి నాయుడుగార్కి. కొత్త పెళ్లికొడుకు దగ్గర నుంచి... రాత్రి డిన్నర్‌లోకి భలానా డిష్ కావాలని... భలానా చోట ఉన్న సూట్స్ తెప్పించమని......

ప్రతివార్తకి ఆయన పౌరుషం ఒకో మెట్టు పెరిగింది. ఆయనలో సరైన ఆలోచన అడుగంటింది. ఆస్థి, అంతస్థుల వ్యత్యాసాల ఆసరాగా. అసహనం ఆయన మనసులో నిండుగా చేరింది. అల్లుడు కోరినవన్నీ చేస్తే చిన్నతనం అనిపించింది. అందుకని ఏదీ చెయ్యకూడదనుకున్నాడాయన. కాని ఓ పక్కన జంకుగా ఉంది.... ఏం రభస జరుగుతుందో అని. అందుకే ఎక్కడా ఓ చోట స్థిరంగా ఉండలేకపోతున్నాడాయన....

* * *

షామియానా కింద మూల మూలలకి వెలుగు పాకుతుంటే, చీకటి చాటు చూసుకుని జంకుగా పిరిగ్గా నిలబడ్ చూశాడాయన కూతురి పెళ్లి.

పేద తండ్రి కన్నకూతురి పెళ్లిచేసి తృప్తిగా విడిచే నిట్టూర్పు రాలేదాయనకి... కళ్లు తృప్తిగా చెమర్చలేదు. పెళ్లయితే అయిపోయింది కాని తర్వాత ఏం రభస జరుగుతుందో అనే భయాన్నే చూశాడాయన పెళ్లికన్నా ఎక్కువగా.

* * *

చూస్తున్న గాలికి 'ఛీ' అనిపించింది. డబ్బుండటం లేకపోవటమే కాదు ఈ పెళ్లిల్లో సమస్య. మనుషులు... వాళ్ల మనుసులు, ఆడ.... మగ, ఎక్కువ..... తక్కువ, అన్న వ్యత్యాసాలతో నిండిన ఆచారలు.... ఇంకా చాలా... చాలా ... ఎన్నాళ్లిలా? అనిపించేటప్పటికి కంపర మెత్తి అక్కడ నుంచి కూడా కదిలి పోయింది గాలి.